క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



ఒడిబియ్యం తీసుకెళ్తున్న మహిళా భక్తులు

పొదలకూరు: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆషాడ మాసం తొలి శుక్రవారం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

పంట కాలువ పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో ఎంపీడీఓ జలజాక్షి

మనుబోలు: మండలంలోని కాగితాలపూరు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.1.80 లక్షలతో జరుగుతున్న పంట కాలువ పనులను శుక్రవారం ఎంపీడీఓ జలజాక్షి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మస్టర్లను పరిశీలించి కూలీలందరూ వచ్చారా లేదా అని తనిఖీ చేశారు. ఆమె వెంట ఏపీఓ రాజమ్మ, టీఏలు గుర్రప్ప, ఎఫ్ఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మనుబోలు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ఎరువు తయారు చేశారు?, ఎంత విక్రయించారు? తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ, కార్యదర్శి బాబురెడ్డి, నాయకులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

వెంకటాచలం: మండలంలోని ఈదగాలిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న ఐదుగురు రైతులకు (18 ఎకరాలకు) 30 రకాల విత్తనాలను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీడీఎంఎస్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన పంటకు ముందు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తాము అందించే విత్తనాలు నాటుకుంటే భూమికి మేలు జరిగి, 60 రోజుల్లో రైతులకు ఆదాయం వస్తుందన్నారు. ఈ విధానంతో భూమి సారవంతంగా మారడంతోపాటుగా, రైతులకు అవసరమైన చిరుధాన్యాలు పంట రూపంలో లభిస్తాయని తెలియజేశారు. అన్నదాతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, పీడీఎంఎస్ ప్రాజెక్ట్ అధికారులు మునిరత్నం, రవిచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలు



అధికారులతో మాట్లాడుతున్న జయలక్ష్మి

కోవూరు: కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని స్త్రీ సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయలక్ష్మి తెలిపారు. ఆమె కోవూరులోని ప్రాజెక్టు కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పరిధిలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అలాగే గర్భిణులు, బాలింతలకు సరఫరా చేసే టేక్ హోమ్ రేషన్ పంపిణీ సమయంలో తప్పనిసరిగా యాప్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల శుభ్రత, వనరుల వినియోగం పట్ల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఆమె స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నాలుగు మండలాల సూపర్‌వైజర్లతో ప్రత్యేకంగా సమావేశం జరిపారు. చిన్నారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రాథమిక దశ నుంచే వెలికితీయాలన్నారు. ఈ సమావేశంలో సీడీపీఓ జ్యోతి పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన అవసరం



చంద్రశేఖరపురం ఏకలవ్య పాఠశాలలో..

కొడవలూరు: డెంగీపై ప్రజల్లో అవగాహన అవసరమని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాల చంద్రబాబు అన్నారు. చంద్రశేఖరపురంలోని ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య పాఠశాల)లో డెంగీపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎడిస్' అనే దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందన్నారు. ఈ క్రమంలో దోమకాటు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా ఈ దోమ ఉత్పత్తిని నివారించవచ్చన్నారు. దోమల వల్ల వివిధ రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున వాటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రీతం బిశ్వాస్, ఏఎంఓ నాగార్జునరావు, ఎస్‌యూఓ నాగరాజు, సీహెచ్ఓ సోమశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, హెచ్‌ఏ ఒ.సుధాకర్, ఏఎన్ఎం ప్రశాంతి, ఆశా కార్యకర్త కల్పన పాల్గొన్నారు.

ప్రచారాలు తప్ప చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న హరిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

కోవూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ప్రచారాలకు మాత్రమే పరిమితమైందని వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి చేయని పథకాలను చేసినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

ప్రసన్నను విమర్శించే స్థాయి ఆమెకు లేదు

మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్థాయి ప్రశాంతమ్మకు లేదన్నారు. జిల్లాకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎన్నో సేవలు, త్యాగాలు చేసినందుకు గుర్తుగా నెల్లూరు బ్యారేజీకి ఆయన పేరు పెడితే కూటమి ప్రభుత్వం దానిని తొలగించడం బాధాకరమన్నారు. నియోజకవర్గంలో ఒకే కుటుంబం నుంచి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరుసార్లు, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఉందన్నారు. రాష్ట్రంలో మండలాల రూపశిల్పిగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఘనత ఉందన్నారు. అలాంటి కుటుంబం గురించి అవహేళనగా మాట్లాడటం మంచిదికాదన్నారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నిరసన తెలిపితే వారి పట్ల ప్రభుత్వం ప్రవర్తించిన తీరు చాలా బాధాకరమన్నారు. కరోనా సమయంలో వైద్యులు చేసిన సేవలు ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, నాయకులు కవరగిరి ప్రసాద్, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వసతులు మెరుగుపరుస్తాం

• ఆర్టీసీ ఆర్ఎం షమీమ్



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం

ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులను మెరుగుపరుస్తామని ఆర్టీసీ డీపీటీఓ రీజినల్ మేనేజర్ షమీమ్ పేర్కొన్నారు. ముత్తుకూరు ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఆర్ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్తుకూరు ప్రాంతంలో పరిశ్రమలు అధికంగా ఉన్నందున బస్టాండ్‌లో రద్దీ బాగా పెరిగిందన్నారు. మరుగుదొడ్లు, కుళాయి కనెక్షన్లను మరమ్మతులు చేయిస్తామని, బస్టాండ్‌కు రంగులు కూడా వేయించడం జరుగుతుందన్నారు. వాహనాలు నిలుపుకొనేందుకు స్టాండ్‌ను ఏర్పాటు చేస్తామని, మొక్కలను పెంపకం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీఓ మస్తానయ్య, సివిల్ ఇంజినీర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి





మనుబోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అరుణ్‌తేజ్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, నాగేశ్వరరావు, బుజ్జయ్య, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి పాల్గొని, అల్లూరి త్యాగాలను వివరించారు. తొలుత గాంధీ విగ్రహంతో పాటు స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యురాలు కందికట్టు రాజేశ్వరి, మేనేజర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య



లక్ష్మీనారాయణ (ఫైల్)

పొదలకూరు: పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి కె.లక్ష్మీనారాయణ (65) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. క్రిమిసంహారక మందు తాగిన లక్ష్మీనారాయణ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు పొదలకూరు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై ఎస్‌కే హనీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ సంతాపం

లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ చేసి ఆరేళ్లవుతోంది. మండల పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ఇతర బాధ్యులు లక్ష్మీనారాయణ మృతికి సంతాపం ప్రకటించారు.

నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయండి

కోవూరు: మండలంలోని రుక్మిణి కల్యాణ మండపంలో ఈనెల 7న జరిగే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం కోరారు. ఈ సమావేశానికి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలన్నారు.

స్థల వివాదంలో దాడి

• ఒకరికి గాయాలు



గాయపడిన హరికృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామంలో స్థలం వివాదమై శుక్రవారం ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తక్కెడ హరికృష్ణ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. అతని పెదనాన్న కుమారుడైన యానాదయ్యతో స్థలం విషయమై గత కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ విషయమై హరికృష్ణ మూడ్రోజుల క్రితం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు శుక్రవారం విచారణ నిమిత్తం గ్రామానికి వచ్చారు. వివాదానికి కారణమైన వారు స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లిపోయారు. దీంతో యానాదయ్య కొంతమందితో కలిసి నాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా.. అంటూ హరికృష్ణపై దాడి చేశారు. దీంతో అతని తలకు గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని నాగమాంబపురంలో మొహర్రంను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు

నెల్లూరు (పొగతోట): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్, సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిరుద్యోగులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం నిర్వహించారు.

ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చొద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయ సన్నిధిని టీడీపీ నేతలు రాజకీయ వేదికగా మార్చవద్దని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రూపకుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఐదు రోజుల క్రితం స్థానిక టీడీపీ నాయకుడు బొద్దుకూరు సుధాకర్ ఎంగిలి ప్లేట్లు వేసి నిరసన తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై ఆలయ ఈఓ ఇప్పటివరకు స్పందించకపోవడంపై సరికాదన్నారు. కనీసం ఈ ఘటనపై బీజేపీ నాయకులు సైతం నోరు మెదపకపోవడం తగదన్నారు. ఎమ్మెల్యే అండదండలు ఉందని ఆయన ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. ఆలయ ప్రాంగణాన్ని రాజకీయ వేదికగా చేసుకొంటున్నారని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అనంతరం మేడ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ఆలయంలో అన్ని సామాజిక వర్గాలు కలిసి ఉత్సవాలు జరుపుకుంటాయన్నారు. అయితే ఇటీవల కాలంలో వర్గాలు, పార్టీలతో చెడ్డ పేరు వస్తోందన్నారు. ఆలయ విషయాలను సోషల్ మీడియాలో పెట్టడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పంబాల జనార్ధన్‌రెడ్డి, గుడి విజయ్‌కుమార్, ఫక్కీరయ్య, చిరమణ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ నిరంజనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామానికే వైద్యులు రావడంతో పాటు అవసరమైతే ఇంటికి వచ్చి వైద్య సేవలందించే కార్యక్రమమే ఫ్యామిలీ డాక్టర్ అని తెలిపారు. ఈ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఏఎన్ఎం సలోమి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరం

• వీసీ అల్లం శ్రీనివాసరావు



బస్సును ప్రారంభిస్తున్న వీసీ

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరమని వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం వర్సిటీలో వీసీ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి వీఎస్‌యూకు చేరుకోవాలంటే విద్యార్థులు, సిబ్బంది చాలా ఇబ్బందులు పడేవారన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని బస్సును కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి, ఆర్టీసీ ఒన్ డిపో మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెన్యూవల్‌కు నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేసిన వీసీ శ్రీనివాసరావు తదితరులు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల అఫిలియేషన్ రెన్యూవల్ పొందేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తూ వీసీ అల్లం శ్రీనివాసరావు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రమాణాలను పాటించే విద్యాసంస్థలకు అఫిలియేషన్ రెన్యూవల్ ఇవ్వబడుతుందన్నారు. కళాశాలలు మౌలిక వసతులు, అధ్యాపక సిబ్బంది వివరాలు సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఈనెల 12 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పొదలకూరు: మండలంలోని పొదలకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ గోదావరి జలాలను కృష్ణా జలాలతో బనకచర్ల రిజర్వాయర్‌లో కలిపితే ఎవరికీ నష్టం ఉండదన్నారు. ఓట్ల రాజకీయాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నట్టు తెలిపారు. తహసీల్దార్ శివకృష్ణయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ధనుంజరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సు సర్వీసులు



బస్టాండ్

పొదలకూరు: ఆర్టీసీ బస్సులు పట్టణంలోని బస్టాండ్‌లోకి వెళుతున్నాయి. దీని చుట్టుపక్కల స్థలాల విలువ విపరీతంగా పెరిగినా వ్యాపారాలు అభివృద్ధి చెందడం లేదు. సర్వీసులు రాకుండా బస్టాండ్ ఖాళీగా మారింది. గతంలో కలెక్టర్ చొరవతో దాని మరమ్మతులు చేపట్టారు. ఫలితంగా కొద్దిరోజులు బస్సులు లోనకు వెళ్లి వచ్చేవి. అయితే బస్టాండ్ ప్రాంగణంలో చాలాకాలం దుకాణ సముదాయాలు ఏర్పడలేదు. ఇటీవల ఒకటి, రెండు షాపులు ఏర్పాటు చేసినా చెప్పుకునే స్థాయిలో వ్యాపారాలు జరగలేదు. ఇటీవల ఆర్టీసీ నెల్లూరు రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి బస్టాండ్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఫలితంగా నిర్వహణలో మార్పులు వచ్చాయి. ప్రస్తుతం నూతనంగా దుకాణాలను నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో కొంత రద్దీ పెరగడం, నివాసాల సంఖ్య పెరుగుతుండటంతో వ్యాపారాలకు ఇబ్బందులుండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంచాయతీ బస్టాండ్‌కు బస్సులు వచ్చి నిలబడుతుంటాయి. ఇక్కడ ప్రయాణికుల రద్దీ పెద్ద సంఖ్యలో ఉంటుంది. ఆర్టీసీ బస్టాండ్ పట్టణానికి కొద్దిగా దూరంగా ఉండటంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే నెల్లూరు, సంగం మార్గాలకు చెందిన ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్ అనుకూలంగా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇప్పుడు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రతి బస్సు సర్వీస్ వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

రొట్టెల పండగ సందడి

నెల్లూరులో రొట్టెల పండగ సందడి నెలకొంది. ఈనెల 6వ తేదీన అధికారికంగా పండగ మొదలవుతుంది. అయితే దూర ప్రాంతాల నుంచి భక్తుల రాక మొదలైంది. శుక్రవారం స్వర్ణాల చెరువులో పెద్ద ఎత్తున కోర్కెల రొట్టెలను భక్తులు అందుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



రొట్టె తీసుకున్న తర్వాత..



దర్గా వద్ద భక్తులు



స్వర్ణాల చెరువులో జనం